## మినీకథ

# ఇ-ఇహ్హిహ్హి

సింహప్రసాద్




రక్తవర్ణం మీద అర్జంట్ అన్న నల్లటి అక్షరాలు గల ఫైలు నందుకుని తాడు విప్పి ఫైల్లోకి చూసిన చందాలరెడ్డిగారి నుదురు ముడిపడింది. కాంట్రాక్టరు పేరు చూసి క్రింది పెదవి కొరుక్కున్నారు. క్రింది ఆఫీసర్ల ఫేవరబుల్ రిమార్కులు చూసి గమ్మనుండిపోయారు కాస్సేపు.

ఇక్కడో ముక్క చెప్పాలి.

చందాలరెడ్డిగారి పేరు విన్నవాళ్ళు ఇదేం పేరని నవ్వుకుంటారు. ఆయన్ని బాగా ఎరిగిన వాళ్ళు ఆయన తల్లిదండ్రుల ముందు చూపుని ప్రశంసిస్తూంటారు. మరికొందరు మాత్రం అది ఆయన అసలు పేరా లేక వాడుక పేరా అని సందిగ్ధంలో పడుతూంటారు

చందాలరెడ్డి గారి తండ్రిగారికి భవిష్యత్తు చదవగల విజ్ఞానం వగైరా వున్నాయో లేవో తెలీదు గాని చందాలరెడ్డి పుట్టినప్పుడు జరిగిన ఓ చిన్న సంఘటనే ఆయన తండ్రి చేత ఆ పేరు పెట్టించింది.

మరేం లేదు. చందాలరెడ్డి తల్లి నొప్పుల్తో రెండు రోజులు బాధపడ్డా పురుడు రాలేదు. ఇదేవిటబ్బా అని అంతా తలలు బద్దలు గొట్టుకొంటోంటే దేవాలయ స్థాపనార్థం ఎవరో చందాకొచ్చారు. దైవకార్యం గనుక లేదని చెప్పలేక చందాలిచ్చి లోపలకొచ్చారో లేదో కేర్‌మని పసివాడి ఏడుపు వినిపించింది గదిలోంచి. దాంతో ఆ పిల్లాడికి చందాలరెడ్డి అని పేరు పెట్టేశారాయన.

చందాలరెడ్డి కూడా చందాలివ్వటంలోనూ. పుచ్చుకోవటంలోనూ కూడా సవ్యసాచీ. సార్థక నామధేయుడు అనిపించుకోవడమే గాక గబగబా నిచ్చెన మెట్లన్నీ ఎక్కి ఇప్పుడో ప్రభుత్వ రంగ సంస్థ యం. డీ. అయి కూర్చున్నారు

సిగరెట్టు దమ్ము గట్టిగా లాగి వదుల్తూ మళ్ళీ ఫైలు పరిశీలించారు.

మూడులక్షల కాంట్రాక్టుని స్వాహారావుకివ్వడం గురించి ఫైనల్ నిర్ణయం తీసుకో దానికి సంబంధించిన ఫైలది. క్రింది నుంచి పైవరకూ ఆఫీసర్లందరూ ఆమోదించమంటూ రాయటమే కాదు. ఎక్కడా చిన్న లొసుగు కూడా లేకుండా పకడ్బందీగా తయారుచేయబడిందది.

తన ఆదాయాన్ని దెబ్బతియ్యడానికి తన సంస్థలోని వాళ్ళంతా కుట్ర చెయ్యటం లేదు కదా అని ఇదయ్యే రోక్షణం. ఎంచేతంటే. ఆర్థిక సంబంధమైన ప్రతి పనిలోనూ ఆర్థిక లాభం చూసుకోవడం ఆయన లక్షణం- పాలసీ. ఆ సంగతి ఓపెన్ సీక్రెట్ గనుక ఆయన వాటాని సీల్డ్‌కవర్లో అందజేస్తున్నారంతా ప్రతిసారీ. కానిప్పుడా సంప్రదాయానికి బ్రేక్ పడింది. చిన్నదో చిటికెదో అయితే పోనీలే అనుకునేవారేమో కాని. మూడులక్షల కాంట్రాక్ట్ అంటే దాదాపు ముప్పైవేలు ఆదాయం రావాల్సినమాట!

ఇంకేం ఆలస్యం చెయ్యకుండా not approved (ఆమోదించలేదు) అని పరపరా రాసేసి సంతకం బరికేశారు చందాలరెడ్డిగారు.

ఫైలునోపక్కకి విసిరేసినా. విసుగూ కోపం తగ్గలేదు. అసంతృప్తి బిళీకూడా ఒకదానితో ఒకటి పోటీపడసాగాయి.

ఇక వుండలేక ఆఫీసునుంచి బయటపడి బార్‌కెళ్ళి స్కాచ్ కొట్టి ఇంటికెళ్ళి పడుకుండిపోయారు.

ఆ మర్నాడూ.ఆ మర్నాడూ కూడా ఆఫీసుకి రాలేదాయన.

చందాలరెడ్డిని తృప్తిపరచక పోతే తన ఫైలు తిరిగొచ్చేస్తుందని తెలిసిపోయింది స్వాహారావుకి. ఇంకో క్షణం కూడా వృధా చెయ్యకుండా ఆయనింటికి పరుగెట్టాడు కూడా.

"తిరుపతెళ్ళేను సార్ అందుకే తమ దర్శనం వెంటనే చేసుకోలేకపోయాను" అంటూ చిన్న నగలపెట్టె ఆయన ప్రక్కన పెట్టాడు స్వాహారావు.

"అలాగా...." అంటూ కొంచెంగా నగలపెట్టె తెరచి చూశారు చందాలరెడ్డిగారు. డైమండ్ నెక్లెస్. దాని ఖరీదు అంచనా వేస్తూ "నీ ఫైలు మీద నాట్ అప్రూవ్ అని రాసేశానోయ్" అన్నారు ఇబ్బందిపడ్తూ.

"తమరు తల్చుకుంటే....ఇ ఇహ్హిహ్హి.." అని చిన్నగా నవ్వేడు స్వాహారావు.

చందాలరెడ్డిగారి బుర్రలో ఫ్లాష్‌లా వెలిగిందో ఐడియా.

"చూద్దాంలే" అనేసి గబగబా షేవింగ్ చేసుకుని సూట్ వేసుకుని ఆఫీసు కెళ్ళారు.

స్వాహారావు ఫైలింకా తన టేబులుమీదే వుండటంతో దాన్నందుకుని not ప్రక్కన 'e' జేర్చారు.

Note approved అన్న అక్షరాల వంక చిరునవ్వుతో చూశారు చందాలరెడ్డిగారు.